కాణిపాకం: గోశాలలో వెలసిన శ్రీ కృష్ణ భగవానుడి విగ్రహానికి పూజలు చేస్తున్న ఆలయ అర్చకులు, కామధేను చిత్రపటానికి పూజలు చేస్తున్న అర్చకులు, ఉట్టి కొడుతున్న కాణిపాకం ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి





గోకులకృష్ణా.. గోపాలకృష్ణా..

కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశు పూజా సామగ్రిని ఊరేగింపుగా తీసుకెళ్లారు. గోశాలలో శ్రీకృష్ణ భగవానుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోపూజ చేసి, దాణా అందించారు. సాయంత్రం ఉట్లోత్సవం సంప్రదాయబద్ధంగా సరదాగా సాగింది. ఆలయ చైర్మన్ ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. చిత్తూరు నగరంలోని శ్రీ అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో గురువారం శ్రీకాళభైరవ ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ వెంకటేష్, ఆలయ చైర్మన్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. కొంగారెడ్డి పల్లికి చెందిన ఓ బాలుడు చిన్ని కృష్ణుడి వేషధారణలో ఆకట్టుకున్నాడు.

– కాణిపాకం(యాదమరి), చిత్తూరు రూరల్






అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో అష్టమిపూజలు, కృష్ణుడి వేషధారణలో చిన్నారి, కాణిపాకం ఆలయం నుంచి ఊరేగింపుగా పూజా సామగ్రిని తీసుకెళ్తున్న ఆలయ చైర్మన్, ఈఓ వెంకటేశు, గోవుకు ప్రసాదం తినిపిస్తున్న చైర్మన్

క్లుప్తంగా

నేడు ఐరాలలో జగనన్నకు చెబుదాం

ఐరాల: ప్రజా సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుశీలమ్మ, ఎంపీడీఓ నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జేసీ శ్రీనివాసులు, జిల్లా స్థాయి అధికారులతో కలిసి వినతులను స్వీకరిస్తారని తెలిపారు. మండల స్థాయి అధికారులందరూ ఈ కార్యక్రమానికి హాజరుకావాలని సూచించారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు గణిత ప్రజ్ఞాధారణ

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని బీఎస్ కణ్ణన్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సమన్వయకర్త అరుణశివప్రసాద్ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ మంగళపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల చేత గణిత ప్రజ్ఞాధారణ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఐటీఐలో పలు కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానం

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం బీఎన్ఆర్పేటలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో పలు కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ సాంబశివ తెలిపారు. ఇందుకు 10వ తరగతి ఉత్తీర్ణత చెందిన విద్యార్థులు అర్హులన్నారు. కోపా మెకానికల్ డీజిల్, ఎలక్ట్రీషియన్, మెకానిక్ మోటర్ వెహికల్, డిమెన్ సివిల్కోర్సులు ఉన్నాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్లైన్లో ఈనెల 19వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. 22వతేదీ బీఎన్ఆర్పేటలోని ఐటీఐలో ఇంటర్వ్యూలు ఉంటాయని చెప్పారు. దరఖాస్తుదారులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

జీజీఎంపీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం



గాండ్లపల్లెలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేయిస్తున్న నాయకులు

బంగారుపాళెం: మండలంలోని గాండ్లపల్లెలో గురువారం సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు సర్పంచ్ మనోహరి తెలిపారు. మొగిలి పంచాయతీ పరిధిలోని గాండ్లపల్లె–మొగిలి మధ్య గడప గడపకు మన ప్రభుత్వం (జీజీఎంపీ) నిధులతో సీసీ రోడ్డు పనులు చేస్తున్నట్లు చెప్పారు. సచివాలయానికి మంజూరైన రూ.20 లక్షలతో గ్రామాల్లో మురుగునీటి పైప్లైన్, సీసీ రోడ్లు వేస్తున్నట్లు తెలిపారు.

మిత్ర పురుగుల నిష్పత్తి ఎక్కువగా ఉండాలి

కార్వేటినగరం: పంట సస్యరక్షణలో దిగుబడికి దోహదం చేసే మిత్ర పురుగులు అధికంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఏఓ హేమలత అన్నారు. గురువారం మండలంలోని డీఎం పురం ఆర్బీకే పరిధిలోని కేఎంపురం గ్రామ సమీపంలో రైతులకు పొలంబడి కార్యక్రమం నిర్వహించి ఖరీఫ్ సీజన్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పంట సాగులో శత్రు పురుగుల కన్నా మిత్ర పురుగులు అధికంగా ఉంటే ఎటువంటి సస్యరక్షణ చర్యలు అవసరం లేదన్నారు. లింగకర్షక బుట్టలు, పసుపు జిగురు పళ్లాలు సమగ్ర పంట సస్యరక్షణ ప్లాట్లో ఉంచడం వల్ల కాండం తొలుచు రెక్క పురుగులు, ఆకుముడత రెక్కపురుగు, సుడిదోమ లాంటి శత్రు పురుగులు ఉధృతిని గమనించి సస్యరక్షణ చర్యలు చేపట్టవచ్చన్నారు. అనంతరం రైతులకు సస్యరక్షణపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు.

కంటి వైద్య శిబిరంలో ఉచిత పరీక్షలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని షర్మన్ బాలికోన్నత పాఠశాలలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎన్ఆర్ఐ ప్రియ, ప్రీతి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో దాదాపు 200 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 32 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి, వాళ్లకు ఉచితంగా చికిత్స అందచేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చెన్నై ఎంఎస్ కంటి ఆస్పత్రి, చిత్తూరు సహస్ర కంటి ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న నిర్వాహకులు

నేటి నుంచి సీజనల్ వ్యాధులపై స్పెషల్డ్రైవ్

చిత్తూరు అర్బన్: నగరంలో సీజనల్ వ్యాధులను నియంత్రించడం కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నుంచి ఈ నెల16వ తేదీ వరకు ప్రతి వార్డులో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. 39వ డివిజన్లో తొలిరోజు కార్యక్రమాన్ని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద ప్రారంభించనున్నట్లు చెప్పారు. నగరంలోని 50 డివిజన్లలో శుక్రవారం నుంచి 12వ తేదీ వరకు ఇంటింటికీ వెళ్లి పైరెథ్రిన్ (దోమల నివారణ మందు) పిచికారీ చేయనున్నట్లు చెప్పారు. 13వ తేదీన ఉదయం నీటి నిల్వ కుంటల్లో దోమ లార్వాల నియంత్రణకు ఆయిల్ బాల్స్ వేయడం, 14, 15 తేదీల్లో కాలువల్లో పూడికతీయడం, 16వ తేదీన ఉదయం మురుగు నీటి కాలువల్లో మలేరియా ఆయిల్ పిచికారీ చేయడం, కల్వర్టర్ల వద్ద ఫాగింగ్ చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. పై కార్యక్రమాల్లో సంబంధిత వార్డుల్లోని ప్రజాప్రతినిధులు భాగస్వాములై విజయవంతం చేయాలని కమిషనర్ కోరారు.

బోర్డు ఏర్పాటుపై హర్షం

చిత్తూరు కార్పొరేషన్: సంచార జాతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక అభివృద్ధి బోర్డు, పాలకవర్గాన్ని ఏర్పాటు చేయడంపై బీజేపీ నాయకులు హర్షం తెలిపారు. సంచార జాతుల సంఘం సభ్యులు గురువారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ నాయకులను కలిసి ప్రధానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ రాసిన లేఖను అందించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా నాయకులు శ్రీనివాసులు, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే ప్రభుత్వ వైద్యం

ఐరాల: గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యసేవలను ఇంటి ముంగిటకే చేర్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి పేదల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తున్నారని స్థానిక పీహెచ్సీ వైద్యాధికారి ప్రవీణ్కుమార్ అన్నారు. మండలంలోని గోవిందరెడ్డిపల్లె, ఇరువారంపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో వైద్యాధికారి గోవిందరెడ్డిపల్లెలో 75 మందికి, ఇరువారంపల్లెలో 65 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్సలు చేసుకున్న రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రజ లు ఆరోగ్యా సూత్రాలు పాటించాలని సూచించా రు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్హెచ్పీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పక్కాగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' అమలు



సమావేశంలో మాట్లాడుతున్న చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పక్కాగా నిర్వహించాలని నగర కమిషనర్ అరుణ నగరపాలక ప్రజారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. నగరపాలక కార్యాలయంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష, క్షేత్రస్థాయి సర్వే, క్యాంపుల నిర్వహణ అంశాలపై ఎంహెచ్వో, అర్బన్ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ, అర్బన్ ఆరోగ్య కేంద్రాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఇందుకోసం వార్డు స్థాయిలో ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే నిర్వహించాలని, ఏఎన్ఎం, వలంటీర్, ఆశ కార్యకర్త ప్రతి ఇంటికీ వెళ్లి క్యాంపు నిర్వహణపై అవగాహన కల్పించడంతోపాటు, ఆరోగ్య సంబంధిత సర్వేలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. క్యాంప్ నిర్వహణ, చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఎంహెచ్వోను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, అర్బన్ ఆరోగ్య కేంద్రాల వైద్యులు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



పెద్దబ్బరెడ్డిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

తవణంపల్లె: మండలంలోని స్వస్తిక్ నగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెద్దబ్బరెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై అవార్డు అందుకోవడంతో గురువారం ఘనంగా సత్కరించారు. స్వస్తిక్ నగర్ పాఠశాల సహోపాధ్యాయుడు నిరంజన్ రెడ్డి, స్థానికులందరూ కలిసి పెద్దబ్బరెడ్డికి శాలువ కప్పి, పూలదండలు వేసి ఘనంగా సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

మిషన్ ఇంద్రధనస్సును జయప్రదం చేయండి




మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి రవిరాజు, కళ్లద్దాలు అందజేస్తున్న వైద్యాధికారి అనిల్కుమార్ నాయక్

యాదమరి: మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ రవిరాజు వైద్యాధికారులకు సూచించారు. ఆయన గురువారం యాదమరి ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో వ్యాక్సినేషన్ ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించి, వందశాతం విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి అనిల్కుమార్ నాయక్, సీఈఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అవ్వాతాతలకు కళ్లజోళ్లు పంపిణీ

మండల పరిధిలోని అవ్వాతాతలకు వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో సంతగేటు వైద్యాధికారి అనిల్కుమార్ నాయక్ కళ్లజోళ్లు పంపిణీ చేశారు. మండల పరిధిలో 9 సచివాలయాల్లో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో 180 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా కళ్లజోళ్లను అందించినట్లు వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి వితరణ



విద్యార్థులకు క్రీడా పరికరాలను అందజేస్తున్న శ్యామలాదేవి

ఐరాల: విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెంపొందించే విధంగా పీడీలు కృషి చేయాలని చిత్తూరుకు చెందిన స్పందన ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్యామలాదేవి పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శ్యామలాదేవి వారి కుమారులు రూ.20 వేలు విలువ చేసే క్రీడా పరికరాలను గురువారం ప్రధానోపాధ్యాయురాలు కోమల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. అనంతరం శ్యామలాదేవి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ రవీంద్రరెడ్డి, స్పందన ఫౌండేషన్ సభ్యులు జ్ఞానప్రసాద్, శైలజ, విశ్రాంత ఉపాధ్యాయురాలు గిరిజ పాల్గొన్నారు.

నేడు గుడిపాలలో మంత్రి పర్యటన

గుడిపాల: మండల పరిధిలోని చీలాపల్లె క్రాస్లో ఉన్న అరుల్పురం వద్ద శుక్రవారం అటవీ, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ఉదయం 10:30 గంటలకు మల్టీస్పెషాలిటీ ప్రైవేట్ ఆస్పత్రిని ప్రారంభించనున్నట్లు చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మొక్కలు నాటి సంరక్షిద్దాం



ర్యాలీలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద

చిత్తూరు అర్బన్: నగరంలో విరివిగా మొక్కలు నాటి సంరక్షిస్తే, అవి జీవకోటికి ప్రాణవాయువుని స్తాయని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. 'ఇంటర్నేషనల్ డే ఫర్ క్లీన్ ఎయిర్ ఫర్ బ్లూ స్కైస్' కార్యక్రమంలో భాగంగా చిత్తూరు నగరపాలక సంస్థ, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గురువారం చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి గాంధీ విగ్రహం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, గాలిలో నాణ్యతను పెంచడానికి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. ప్రధానంగా నగరంలో రద్దీ ఎక్కువగా ఉండే కూడళ్లలో మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. వీలైనంత ఎక్కువగా మొక్కలు నాటడం ద్వారా గాలిలో కాలుష్యాన్ని తగ్గించవచ్చని చెప్పారు. కాలుష్య నియంత్రణ కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా సిద్ధార్థ నగర్లో ప్రజా ప్రతినిధులు మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్ ఆర్ చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్ రాజారెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇంజనీర్ నరేంద్రబాబు, డీఈఈ వెంకట ప్రసాద్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, ఏఈలు, పీసీబీ అధికారులు, వార్డు కార్యదర్శులు, నగర పాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేషన్ పరిధిలో చేర్చడమే సమస్య

- ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు స్థానికుల వినతి



సచివాలయ అధికారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

యాదమరి: మండలంలోని వరిగపల్లె, కుక్కలపల్లె పంచాయతీలను కార్పొరేషన్ పరిధిలో చేర్చడం వల్లే సమస్యలు ఎదురవుతున్నాయని స్థానికులు ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు విన్నవించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఎంఎస్ బాబు గురువారం ఈ వరిగపల్లె, కుక్కలపల్లె పంచాయతీల్లో పర్యటించారు. స్థానికులు మాట్లాడుతూ, ఈ రెండు పంచాయతీలను చిత్తూరు కార్పొరేషన్ 21వ వార్డు పరిధిలో చేర్చడం వల్ల తలెత్తిన సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. ఎమ్మెల్యే, రెవెన్యూ, పోలీసు, విద్యుత్శాఖ అధికారులు యాదమరి మండలానికి చెందగా, వసతుల కల్పన, సమస్యల పరిష్కారం, అభివృద్ధి బాధ్యతలను మాత్రం కార్పొరేషన్కే కేటాయించారు. దీంతో ఇక్కడ అర్హులైన వారికి ఇళ్లు మంజూరు కాలేదు. మురుగునీటి కాలువలు శుభ్రం చేసేవారు లేరు. తాగునీరు, రోడ్డు సమస్యలు పరిష్కరించేవారే లేరు. చిత్తూరు కార్పొరేషన్ కమిషనర్కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని చెప్పారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే కమిషనర్కు ఫోన్ చేసి 21వ వార్డులో సమస్యలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. దీంతో కమిషనర్ మాట్లాడుతూ 21వ వార్డు, ఎక్కడ ఉందని సమాధానం ప్రశ్నించడంతో, ఎమ్మెల్యే మండిపడ్డారు. ఈ వార్డుల్లో పర్యటించి పరిశీలించాలని, ప్రజా సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. దీనిపై జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే, జెడ్పీ వైస్ చైర్మన్ మాట్లాడుతూ ప్రతి సమస్యనూ పరిష్కరిస్తామని, సమస్యలు తెలుసుకోవడానికే ప్రతి గడపకు వస్తున్నామన్నారు. కార్యక్రమంలో చిత్తూరు మేయర్ అముద, యాదమరి ఎంపీపీ సురేష్బాబు, 21వ వార్డు కౌన్సిలర్ ప్రకాష్రెడ్డి, జిల్లా వైఎస్సార్సీపీ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, నాయకులు పాల్రాజ్, మురగ, సుధీర్ రెడ్డి, శివ, దండపాణి తదితరులు పాల్గొన్నారు.

ఫొటో చూడగానే నమస్కరించిన వృద్ధురాలు



21వ వార్డులో పర్యటించిన ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పథకాల లబ్ధిపై మహిళలతో మాట్లాడారు. సంక్షేమ బావుటా బుక్లెట్పై ఫొటోను చూపించి, ఈయన ఎవరో గుర్తుపడుతావా అమ్మా అని అడగ్గానే... ఆ మహిళ చేతులెత్తి నమస్కరించింది... జగన్బాబును చూడగానే చేతులెత్తి మొక్కాలనిపిస్తుంది అని చెప్పింది. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో శుక్రవారం కుక్కలపల్లెలో నిర్వహించనున్నట్లు వార్డు కౌన్సిలర్ ప్రకాష్ రెడ్డి తెలిపారు.